గలగల పారేలా..

- ఎన్నికల కోడ్ అనంతరం పనులు ప్రారంభించేలా చర్యలు
- అన్ని కాలువల్లోనూ తూటికాడ, పూడికతీత పనులు
- కృష్ణా జిల్లాలో 5.62 లక్షల ఎకరాల ఆయకట్టు
- గత ఏడాది వీటి కోసం రూ.28.17 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం

సాగునీటి కాలువల నిర్వహణకు రూ. 53.63కోట్లు


బందరు కాలువ ప్రస్తుత పరిస్థితి

సాక్షి ప్రతినిధి, విజయవాడ: కృష్ణా డెల్టా పరిధిలో ఆయకట్టుకు నీరు ఇబ్బంది లేకుండా అందించేందుకు వీలుగా సాగునీటి పారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రధానంగా కాలువల్లో తూటికాడ, పూడికతీత, కాలువగేట్ల మరమ్మతులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో పాటు గట్లకు గండ్లుపడే అవకాశం ఉన్నచోట, లాకుల వద్ద గేట్లు, డ్రాప్‌లు దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతులు చేపడతారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ఇప్పటికే అధికారులు బందరు, కేఈబీ, ఏలూరు, రైవస్ నాలుగు కాలువల పరిధిలో నిర్వహణ కోసం మొత్తం 238 పనులను రూ.53.63 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ పనులకు ఎస్‌ఈ ఆమోదం తెలిపి, సీఈ కార్యాలయానికి పంపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో దీనిపై ఇంకా చర్యలు తీసుకోలేదు. కోడ్ అనంతరం పనులకు ఆమోదం తెలిపి, టెండర్లు పిలిచేందుకు వీలుగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. డెల్టా కింద నీటి శిస్తు రెవెన్యూ శాఖ వసూలు చేయగా.. ఆ మొత్తం కలెక్టర్ ఖాతాకు చేరుతాయి. ఈ నిధులను ఆయకట్టు అభివృద్ధి శాఖ (సీఏడీ)కు పంపిస్తారు. నిధుల లభ్యత మేరకు పనుల ప్రాధాన్యతను బట్టి కేటాయిస్తారు.

ఇది కృష్ణా డెల్టా పరిస్థితి..

ప్రకాశం బ్యారేజి కింద కృష్ణా డెల్టా పరిధిలో 13.08 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో కృష్ణా జిల్లాలో తూర్పు డెల్టా పరిధిలో 5.62లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో నామ మాత్రంగా 1,757 ఎకరాల ఆయకట్టు మాత్రమే ఉంది. ఇందులో ఎక్కువ భాగం మెట్ట ప్రాంతం కాగా, మిగిలిన ఆయకట్టు నాగార్జునసాగర్ కుడికాలువ కింద ఉంది. ఈ ఆయకట్టుకు ఆలస్యంగా నీరు ఇస్తారు. గతేడాది కాలువల నిర్వహణ కోసం టెండర్లు పిలిచిన పనులు, ఈ నెలాఖరు లోపు పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గత ఏడాది జూన్‌లో పనులకు టెండర్లు పిలిచినా, ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని, జూన్ 6వ తేదీనే నీటిని విడుదల చేయడంతో, పనుల్లో జాప్యం జరిగింది. మిగిలిన పనులను ఇప్పుడు చేస్తున్నారు.

నిండుకున్న ప్రాజెక్టులు..

ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జలాశయాలు అన్ని అడుగంటాయి. శ్రీశైలం, నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు లేవు. కృష్ణా నది ఎగువ ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురిస్తేగాని వరద నీరు ప్రాజెక్టులోకి చేరదు.

నీటిపారుదల శాఖ అధికారులు ప్రాజెక్టులోకి నీరు చేరిన వెంటనే నీటిని విడుదల చేయడానికి సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల కోడ్ అనంతరం నీటి విడుదలపైనా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది ముందస్తుగా రుతు పవనాలు వస్తాయని వాతావరణశాఖ నిపుణులు చెబుతున్నారు. దీనికి తోడు ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొలకరి వర్షం రైతన్నలను పలకరించింది. కాలువలకు నీటిని త్వరగా విడుదల చేస్తే, పంటకోత సమయంలో తుపానుల బెడద నుంచి తప్పించుకోవచ్చు. రెండో పంటను ముందుగా సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చు. ఈ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం గత రెండేళ్లుగా ముందస్తుగా కాలువలకు నీటిని విడుదల చేస్తోంది. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు వస్తాయన్న అధికారుల సూచనతో రైతన్నలు ఆశావహ దృక్పథంతో పంటలు సాగు చేసుకొనేందుకు సిద్ధమవుతున్నారు.

కాలువ పేరు	కృష్ణా జిల్లా (లక్షల ఎకరాల్లో)	ఎన్టీఆర్ జిల్లా (ఎకరాల్లో)
బందరు	1.51	–
కేఈబీ(కరువు)	1.38	–
ఏలూరు	0.56	1,332
రైవస్	2.17	425
మొత్తం	5.62	1,757

గత ఏడాది నిర్వహణ పనులు ఇలా..(2023-24)

డివిజన్	పనులు	నిధులు (రూ.లక్షల్లో)
కృష్ణా తూర్పు	37	752.85
కృష్ణా మధ్య	42	852.85
డ్రెయినేజీ	72	1200.00
స్పెషల్	01	11.40
మొత్తం	152	2,817.1

ఈ ఏడాది నిర్వహణ పనులు ఇలా..

మొత్తం పనులు:	238
అంచనా విలువ మొత్తం:	రూ. 53.63కోట్లు

క్లుప్తంగా

శోభాయాత్ర కరపత్రాల పంపిణీ



పెడన: హనుమాన్ శోభాయాత్రను జూన్ 1న పట్టణంలో నిర్వహించనున్నట్లు అభయాంజనేయస్వామి దేవస్థానం ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ, భక్త బృందం కరపత్రాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామలక్ష్మి వీవర్స్ కాలనీలోని దేవస్థానం వద్ద హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం 8.30గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం 9.30 గంటలకు గుడి వద్ద శోభాయాత్ర ప్రారంభమై పట్టణంలోని దేవాలయాలను సందర్శించి తిరిగి రామలక్ష్మి వీవర్స్ కాలనీ వద్ద గుడికి చేరుకుంటుందని పేర్కొన్నారు. అనంతరం అన్నసమారాధన జరుగుతుందని తెలిపారు.

కౌంటింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు ముమ్మరం

పెడన: సాధారణ ఎన్నికల పోలింగ్ పూర్తి కావడంతో జూన్ 4న లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించడానికి అధికార యంత్రాంగం చర్యలను వేగవంతం చేసింది. మొదటగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపునకు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి సారించి అందుకు తగ్గ బాక్సులను సిద్ధం చేస్తోంది. పెడన తహసీల్దార్ కార్యాలయంలో బాక్సులను సిద్ధం చేస్తోంది. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు మూడు టేబుల్స్‌ను సిద్ధం చేస్తారని ఇప్పటికే అధికారులు పేర్కొన్నారు. ఆ టేబుల్స్‌పై బాక్సులు పెట్టి ఏ గడి ఏ అభ్యర్థికి కేటాయించిందనే వివరాలను తెలిసేలా పేర్లను రాసి సిద్ధం చేస్తున్నారు. వీటిని కృష్ణా యూనివర్సిటీకి తరలించి అక్కడ లెక్కింపు సమయంలో టేబుల్స్‌పై ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు, రేపు యల్లారమ్మ జాతర



నాగాయలంక: స్థానిక సబ్బినేనిబజారులో కొలువైఉన్న సబ్బినేని వారి కులదేవత యల్లారమ్మ అమ్మవారి జాతర ఉత్సవం శని, ఆదివారాలు జరుగుతుందని శుక్రవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు సబ్బినేని భుజంగరావు తెలిపారు. శనివారం గ్రామస్తుల నేతృత్వంలో అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా నాగాయలంకలోని కృష్ణానదికి తీసుకెళ్లి శ్రీరామపాదక్షేత్రం ఘాట్‌లో పుణ్యస్నానాలు చేయించారు. తర్వాత గ్రామలోని టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని జల్దిలో ఉంచుతారు. అనంతరం రాత్రికి జల్దినుంచి తరలించి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం ముగిసి ఘటాలు గుడికి చేరుకున్నాక ఆదివారం జాతర సంప్రదాయాల ప్రకారం సంబరం జరుపుతామని, భక్తులు చద్ది నైవేద్యాల సమర్పణతో మొక్కుబడులు తీర్చుకుంటారని అనంతరం అన్నసంతర్పణ నిర్వహిస్తామని చెప్పారు.

30న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెడన: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30వ తేదీ ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని ఎంపీడీవో వి.రెడ్డయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఎంపీడీవో కార్యాలయంలోని మీటింగ్‌హాలులో ఎంపీపీ వాణి అధ్యక్షతన జరిగే సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాల్సిందిగా పేర్కొన్నారు. అధికారులు సమాచారంతో హాజరుకావాల్సిందిగా తెలిపారు.

భక్తిశ్రద్ధలతో చక్రస్నాన ఉత్సవం



అవనిగడ్డ: బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో చక్రస్నాన ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆగమ పండితుడు దీవి పార్థ వెంకటరామ శ్రీనివాసాచార్యులు బ్రహ్మత్వంలో స్వామివారికి నిత్యహోమం, బలిహరణ, చూర్ణోత్సవంతో పాటు చక్రస్నానం చేయించారు. ఆలయ ఈవో వై. శ్రీనివాసరావు, ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కరరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నేడు ఉచిత బీఎండీ క్యాంపు

అవనిగడ్డ: గాలిగోపురం వద్ద నున్న శ్రీధన్వంతరీ ఆయుర్వేద చికిత్సాలయం వద్ద శనివారం ఉచిత ఎముకల పటుత్వ పరీక్ష (బీఎండీ క్యాంపు) నిర్వహించనున్నట్టు డాక్టర్ దీవి పాంచజన్యకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.2వేలు ఖరీదు చేసే ఈ పరీక్ష ఉచితంగా చేయనున్నట్టు పేర్కొన్నారు. జండు ఫార్మా ఆర్థిక సాయంతో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పరీక్షలు చేస్తారని వివరించారు. ఎముకల పటుత్వ పరీక్షలు చేయించుకోవాలనుకునే వారు డాక్టర్ భావన సెల్ 94920 90698, 79893 57885 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆ ప్రాంతానికి బ్రహ్మపురం పేరొచ్చి 90 ఏళ్లు

బ్రహ్మంగారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు



పెడన: పెడనలోని బ్రహ్మపురం ప్రాంతానికి పేరు నామకరణంతో పాటు అక్కడ బ్రహ్మంగారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి 90 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభసందర్భంగా ఆ నాటి విగ్రహస్థాపకులు బీరక మల్లికార్జునుడు వంశీయులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1934లో మే 24న శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆశీస్సులతో బీరక మల్లికార్జునుడు అప్పట్లో బ్రహ్మంగారి విగ్రహాన్ని ప్రతిష్ఠింపజేశారు. ఆ ప్రాంతానికి బ్రహ్మపురం అని నామకరణం చేశారు. అప్పటి నుంచి కూడా బ్రహ్మపురంగా పిలుస్తున్నారు. అక్కడ విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో అక్కడ ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవిస్తున్నారనేది నమ్మకం ఏర్పడిందనేది స్థానికుల విశ్వాసం. ఈ నేపథ్యంలో 90 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మల్లికార్జునుడు మనవడు బీరక మల్లికార్జునుడు, సుమలత దంపతులు ప్రత్యేక పూజాది కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన ఏర్పాటుచేశారు. స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మ తల్లి సంబరాలు

చల్లపల్లి: మండలంలోని లక్ష్మీపురం శివారు నూకలవారిపాలెం గ్రామంలో శుక్రవారం శ్రీఅంకమ్మ తల్లి అమ్మవారి వార్షిక సంబరాలు ఘనంగా నిర్వహించారు. కమిటీ పెద్దల ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేయగా, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో అంకమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు.

ముగిసిన కల్యాణోత్సవాలు


శ్రీభావన్నారాయణుని రథోత్సవం పూజలు చేసిన పండితులు

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని శ్రీదేవి భూదేవి శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావన్నారాయణ స్వామి ఆలయంలో ఆరు రోజులుగా జరిగిన కల్యాణ మహోత్సవాలకు శుక్రవారం స్వస్తి పలికారు. ఆలయ ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు పర్యవేక్షణలో గురువారం రాత్రి గౌరీశంకరస్వామి సంగీత సారథ్యంలో రథోత్సవం ఘనంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్లబండిపై స్వామి వారు, దేవేరుల ఉత్సవమూర్తులతో గ్రామంలో కనులపండువగా ఊరేగింపు సాగింది. తొలుత ఆలయ ప్రధాన అర్చకుడు పంచాగం రమణాచార్యులు, యజ్ఞబ్రహ్మ కండూరి శ్రీనివాసాచార్యులు బ్రహ్మత్వంలో రథంగహోమం తర్వాత గ్రామ బలిహరణం పూజలు నిర్వహించారు. వంశ పారంపర్య కుటుంబ సభ్యులు భోగాది వెంకట శేషగిరిరావు, భోగాది లోకేశ్వరరావు, భోగాది అప్పారాయుడు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు. శుక్రవారం వసంతోత్సవం ఘనంగా సాగింది. ధ్వజావరోహణం, పూర్ణాహుతి, ద్వాదశ ప్రదక్షిణలు, పుష్పార్చన, పవళింపుసేవ కార్యక్రమాలతో శ్రీభావన్నారాయణుని వార్షిక కల్యాణోత్సవాలకు స్వస్తి పలికారు.

ముగిసిన మాధవస్వామి బ్రహ్మోత్సవాలు


గూడూరు: గూడూరులోని శ్రీలక్ష్మీ భూలక్ష్మి సమేత శ్రీ మాధవస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ నెల 19న ప్రారంభమైన ఉత్సవాల్లో చివరి రోజు శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణ, మౌనబలి నిర్వహించారు. అనంతరం భక్తులు ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. రాత్రి స్వామి వారి పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ముమ్మరంగా సిల్ట్ తొలగింపు పనులు



మచిలీపట్నం టౌన్: నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రెయిన్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 50 మంది కార్మికులతో రెండు బృందాలు ఏర్పాటు చేసి కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు పనులు చేస్తున్నారు. నగర కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు పర్యవేక్షణలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

భ్రమరాంబకు ప్రత్యేక పూజలు


కొక్కిలిగడ్డలో శ్రీ గంగా భ్రమరాంబ అమ్మవారు

కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడోరోజు వేదపండితులు గుండెపూడి నాగరాజశేఖర్ శర్మ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా ఉదయం 8 గంటలకు నిత్యహోమం, ప్రభాత బలిహరణ, మండప దేవతాహోమాలు, స్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి సువాసినీలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు నిత్యహోమాలు, చండీ సప్తశతీహోమం, రుద్రహోమం, నీరాజన మంత్రపుష్పాలతో పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడొద్దు


సదస్సులో డీఎస్పీ సుభాన్

కోనేరుసెంటర్: ఎన్నికల కౌంటింగ్ రోజున ఎవరైనా చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని బందరు డీఎస్పీ మహమ్మద్ సుభాన్ హెచ్చరించారు. ఆయన ఇనగుదురుపేట పోలీస్‌స్టేషన్ పరిధి గొడుగుపేటలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కుల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. 4వ తేదీ కౌంటింగ్ రోజున ఎవరైనా అల్లర్లు, అలజడులకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సీఐ సీహెచ్ విద్యాసాగర్ వివిధ అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన ఉండాలి


ఘంటసాల పీహెచ్‌సీ డాక్టర్ ప్రమోద్‌తో వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

ఘంటసాల: విద్యతో పాటు సామాజిక అంశాలపై అవగాహన ఉండాలని ఘంటసాల పీహెచ్‌సీ డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్ అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం బాపట్లకు చెందిన వ్యవసాయ కళాశాల విద్యార్థినులు గ్రామీణ వ్యవసాయ పని అనుభవంలో భాగంగా ఘంటసాల గ్రామంలో ఉంటున్నారు. ఎన్ఎస్ఎస్ క్యాంపు ద్వారా గురు, శుక్రవారాలు ఘంటసాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఓపీ సేవలు, మందులు పంపిణీ, ఇతర సేవలను అందించారు. సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేసి ఎర తయారు చేసే విధానాన్ని, వాటి ఉపయోగాలను రైతులకు వివరించారు. అనంతరం ఘంటసాల జెడ్పీ హైస్కూల్లో పరిసరాలను పరిశుభ్రం చేసి స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు డాక్టర్ అపర్ణ, డాక్టర్ విజయ్ కుమార్, విద్యార్థినులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు అగ్నికి ఆహుతి


కోడూరులో దగ్ధమవుతున్న పూరిల్లు


బాధితురాలికి సాయం అందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

కోడూరు: కట్టెల పొయ్యిపై వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు పూరిల్లుపై పడటంతో అగ్నికి ఆహుతైన ఘటన కోడూరు మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని రామకృష్ణాపురం గ్రామానికి బెల్లంకొండ రత్నకుమారి తన ఇంట్లో గురువారం రాత్రి 8గంటల సమయంలో కట్టెల పొయ్యిపై వంట చేస్తోంది. మంట అధికంగా రావడానికి రత్నకుమారి ఊదుతుండటంతో నిప్పురవ్వలు వచ్చాయి. దీంతో రత్నకుమారి బయటకు పరుగులు తీయగా, నిమిషాల వ్యవధిలో ఇల్లు మొత్తం కాలిపోయింది. ఘటనలో గృహోపకరణలు, విలువైన వస్తువులు బూడిదయ్యాయని, రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని బాధితురాలు తెలిపారు.

దాతలు సాయం

బాధితురాలు రత్నకుమారికి దాతలు సాయం అందించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గృహోపకరణాలు, నిత్యావసర సరుకులు, 25 కేజీల బియ్యాన్ని అందించారు. సొసైటీ మండలాధ్యక్షుడు వేజెండ్ల శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ తోట శ్రీనివాసరావు, సభ్యులు కొండవీటి సురేష్, పాండురంగారావు పాల్గొన్నారు. రామకృష్ణాపురం వీఆర్వో ఏడుకొండలు బాధిత కుటుంబానికి బసటగా నిలిచాడు. 100కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు, కూరగాయలను అందించారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా ఉపాధి హామీ పనులు


తోట్లవల్లూరులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మండవల్లి: జాతీయ ఉపాధి హామీ పథకం పనులతో రైతులకు ఎంతో అండ లభిస్తుందని ఎంటీఏ ఎన్ నవీన్ పేర్కొన్నారు. మండలంలోని అల్లినగరంలో రూ. 1.20 లక్షల ఉపాధి నిధులతో, 72 మంది కూలీలు పంట కాలువ అభివృద్ధి పనులు శుక్రవారం చేశారు. కాలువలను అభివృద్ధి చేయడం ద్వారా పంట పొలాలకు సాగునీరు సక్రమంగా చేరుతుందని ఎంటీఏ తెలిపారు. దీంతో రైతులకు అధిక దిగుబడులు సాధించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో ఉపాధిహామీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామంలోని చిల్లడొంక రహదారి, ఆర్‌అండ్‌బీ రహదారి, అమ్మగారి చెరువు ప్రాంతంలో పంట కాలువల పూడిక తీత పనులను శుక్రవారం కూలీలు నిర్వహించారు.

ఇంటింటి సర్వేపై సమీక్ష


గూడూరులోని భవితకేంద్రంలో సమీక్షిస్తున్న అధికారులు

గూడూరు: ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల గుర్తింపునకు గూడూరులోని భవిత కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను జిల్లా ఐఈ సమన్వయకర్త కె.ఏడుకొండలు సమీక్షించారు. గూడూరులోని భవిత కేంద్రాన్ని శుక్రవారం ఎంఈఓ-2 పి.సుబ్రహ్మణ్యంతో కలిసి సందర్శించిన ఏడుకొండలు ఇప్పటి వరకు సర్వే పురోగతిని అడిగి తెలుసుకున్నారు. 0 నుంచి 18 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రత్యేక అవసరాలు కలిగిన బాలబాలికలను గుర్తించడమే కాకుడా భవిత కేంద్రంలో నమోదు చేయించాలని సమన్వయకర్త కె.ఏడుకొండలు సూచించారు. స్థానిక అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల సహకారంతో నూరు శాతం బాలబాలికలను గుర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ పి.రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.వెంకటేశ్వరమ్మ, బి.భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు మందులు, కళ్లజోళ్ల పంపిణీ



మచిలీపట్నం టౌన్: మచిలీపట్నం నగరం నుంచి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు శుక్రవారం మోడరన్ ఐ కేర్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో మందులు, కళ్లజోళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. వైద్యశాల నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ జి.భానుమూర్తి పర్యవేక్షణలో వీటిని అందజేశారు. నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో మందులు, మోడ్రన్ ఆప్టికల్స్ ఆధ్వర్యాన కళ్లజోళ్లను అందజేశారు. ప్రతి యాత్రికుడికి రెండు గ్రిప్ తాళ్లను కూడా ఇచ్చారు. కార్యక్రమంలో మోడ్రన్ ఐ కేర్ ట్రస్ట్ ఆర్గనైజర్లు ఎండీ రియాజ్, ఎండీ యూనిస్ పాల్గొన్నారు.

గౌరమ్మకు నివాళులర్పించిన సింహాద్రి



కోడూరు: అవనిగడ్డ విద్యుత్‌శాఖ ఏడీఏ సుబ్రహ్మణేశ్వరావు మాతృమూర్తి గౌరమ్మ వృద్ధాప్యంతో శుక్రవారం వేకువజామున మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు ఆరవ వార్డులోని గౌరమ్మ ఇంటికి వచ్చి నివాళులర్పించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ ఎస్సీసెల్ కన్వీనర్ ప్రసాద్, నాగరాజు, సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.